# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 01-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- పాదరక్షల ఉత్పత్తి, వినియోగంలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

- పార్లమెంటు శీతాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజున ఎస్.ఐ.ఆర్.పై విపక్షాలు చేసిన నినాదాలతో ఉభయ సభలు రేపటికి వాయిదా పడ్డాయి.

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిబద్ధతతో పని చేయడం పార్లమెంట్ సభ్యుల విధి అని ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్ స్పష్టం చేశారు.

- పంజాబ్, హర్యానా, చండీగఢ్‌లలో అతి శీతల గాలులు రానున్న రెండు రోజుల పాటు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

పాదరక్షల ఉత్పత్తి, వినియోగంలో భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని ఫుట్ వేర్ డిజైన్, డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్డీడీఐ) స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ఈరోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. నేడు భారత్ మరింత స్వయం పరిపూర్ణ దేశంగా మారుతూ.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో తన పాత్రను విస్తరించేందుకు కృషి చేస్తోందన్నారు. పాదరక్షల రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం అనుకూల వ్యవస్థను, ప్రోత్సాహకాలను అందిస్తోందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశ పాదరక్షల ఎగుమతులు 2 వేల 500 మిలియన్ డాలర్లకు పైగా ఉండగా.. దిగుమతులు సుమారు 680 మిలియన్ డాలర్లుగా ఉన్నాయని చెప్పారు. దేశంలో పాదరక్షల ఎగుమతులు.. దిగుమతుల కంటే దాదాపు నాలుగు రెట్లు అధికంగా ఉన్నాయని రాష్ట్రపతి వెల్లడిస్తూ...

(వాయిస్ 21 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈరోజు ప్రారంభమయ్యాయి. మొత్తం 19 రోజుల పాటు జరిగే ఈ సమావేశాల్లో తొలిరోజు ఓటర్ల ప్రత్యేక సవరణల జాబితా (SIR) పై చర్చ చేపట్టాలని విపక్షాలు నినాదాలు చేయడంతో లోక్ సభ పలుమార్లు వాయిదా పడింది. మొదటి వాయిదా తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభ తిరిగి సమావేశమైనప్పుడు, ప్రతిపక్ష సభ్యులు మళ్ళీ నినాదాలు చేయడం ప్రారంభించారు. నినాదాల మధ్య, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పొగాకు, దాని సంబంధిత ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం విధించడానికి సెంట్రల్ ఎక్సైజ్ (సవరణ) బిల్లు 2025ను ప్రవేశపెట్టారు. పాన్ మసాలా వంటి నిర్దిష్ట వస్తువుల ఉత్పత్తిపై సెస్సు విధించడానికి సీతారామన్ హెల్త్ సెక్యూరిటీ సెసేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు 2025ను కూడా ప్రవేశపెట్టారు. అలాగే మణిపూర్ వస్తు సేవల పన్ను (రెండవ సవరణ) బిల్లు, 2025ను కూడా ప్రవేశపెట్టారు. ఇక మధ్యాహ్నం 2 గంటల వరకు లోక్‌సభ మరోసారి వాయిదా పడింది. మధ్యాహ్నం రాజ్యసభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 సంవత్సరానికి గ్రాంట్ల కోసం అనుబంధ డిమాండ్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం ఇటీవల ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళా క్రికెట్ జట్టును, భారత మహిళల అంధుల క్రికెట్ జట్టును, మహిళా కబడ్డీ జట్లను సభ అభినందించింది. ఆ తరువాత SIR పై గందరగోళం సభలో చెలరేగడంతో సభను రేపటికి వాయిదా వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు సభ్యులు రాజ్యాంగాన్ని కాపాడుతూ ప్రవర్తనా నియమావళిని పాటించాలని రాజ్యసభ చైర్మన్ సీ.పీ. రాధాకృష్ణన్ సభ్యులను కోరారు. ఈరోజు ప్రారంభమైన శీతాకాల సమావేశాల మొదటి రోజున చైర్మన్‌గా మొదటిసారిగా సభను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజల న్యాయమైన ఆకాంక్షలను నెరవేర్చడానికి నిబద్ధతతో పని చేయడం సభ్యుల విధి అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో మాత్రమే ఒక వ్యక్తి అత్యంత వినయపూర్వకమైన ప్రారంభం నుండి ప్రజా జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగగలడని వ్యాఖ్యానిస్తూ..

(వాయిస్ 26 సెకన్లు)

ఇక రాజ్యసభకు తొలిసారి అధ్యక్షత వహిస్తున్న ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాగతం పలికారు. ప్రజాస్వామ్యానికి సవాళ్లు ఎదురైన ఎమర్జెన్సీ సమయంలో.. పరిమిత వనరులే ఉన్నప్పటికీ సి.పి. రాధాకృష్ణన్ చూపిన సాహసోపేత వైఖరిని నరేంద్రమోదీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పార్లమెంటు సభ్యుడిగా, రాజ్యసభ చైర్మన్‌గా, ప్రస్తుతం ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్‌కు ఉన్న అపారమైన అనుభవం.. సభకు, దేశానికి దారిదీపంగా నిలుస్తుందని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి ఇప్పటివరకు 2 కోట్ల 72 లక్షల మంది నమోదు చేసుకున్నారని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. రాజ్యసభలో ఈరోజు ఒక ప్రశ్నకు ఆమె లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఈ పథకం కింద ఇప్పటివరకూ 23 లక్షల మంది చేతివృత్తుల వారికి నైపుణ్య శిక్షణ అందించామని చెప్పారు. డిజిటల్ ప్రోత్సాహకాల కింద 7 లక్షల మంది లబ్ధిదారులకు 23 కోట్ల రూపాయలు చెల్లించామని వెల్లడించారు. చేతులు, ఇతర సాధనాలతో పనిచేసే 18 సాంప్రదాయ వర్తకాలకు చెందిన వారికి పూర్తి స్థాయి సమగ్ర మద్దతును అందించేందుకు 5 సంవత్సరాల కాలపరిమితితో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని 2023లో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు నవంబర్ నెలలో 1,900 కోట్లు దాటాయని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పిసిఐ) ఒక నివేదికలో వెల్లడించింది. ఎన్పిసిఐ విడుదల చేసిన నివేదిక ప్రకారం నవంబర్‌లో సగటు రోజువారీ లావాదేవీల మొత్తం 87 వేల 721 కోట్ల రూపాయలుగా ఉంది. నవంబర్ నెలలో సగటు రోజువారీ లావాదేవీల సంఖ్య 68 కోట్ల రూపాయలు దాటిందని వెల్లడించింది. నవంబర్ లో UPI లావాదేవీల సంఖ్య 25 శాతం వృద్ధిని నమోదు చేయగా లావాదేవీల మొత్తంలో 16 శాతం వార్షిక వృద్ధిని 27.28 లక్షల కోట్ల రూపాయలుగా నమోదు చేసింది. దేశీయ డిజిటల్ చెల్లింపుల రంగంలో ప్రధాన భూమిక పోషిస్తున్న UPI లావాదేవీలు ఈ ఏడాది మొదటి అర్ధభాగం పూర్తయ్యేసరికి 10 వేల 600 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్, హర్యానా, చండీగఢ్‌లలో రానున్న రెండు రోజులపాటు అతి శీతల గాలులు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. రాజస్తాన్, మహారాష్ట్రలో కూడా ఇవే పరిస్థితులు కొనసాగుతాయని తెలియజేసింది. నైరుతి బంగాళాఖాతంలోని తీవ్ర వాయుగుండం కారణంగా ఉత్తర తమిళనాడు, కోస్తాంధ్రలో ఈరోజు, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

పవిత్ర గీతా జయంతి సందర్భంగా దేశ ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణపై అమూల్యమైన సందేశాలతో రూపొందించిన ఈ దివ్య గ్రంథం భారతీయ కుటుంబ, సామాజిక, ఆధ్యాత్మిక జీవితాల్లో అత్యంత విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. భగవద్గీత దివ్య శ్లోకాలు నిస్వార్థ చర్య వైపు ప్రతితరాన్ని ప్రేరేపిస్తూనే ఉంటాయని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

నెట్‌ఫ్లిక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సర్వీసెస్ ఇండియాతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఒక వాణిజ్యేతర అవగాహనా ఒప్పందాన్ని (ఎంఓయూ) కుదుర్చుకుంది. సినిమా తరహా కథనాల ద్వారా భారతదేశ పర్యాటక ప్రాంతాలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రచారం కల్పించాలనే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకుందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లోక్ సభలో ఈరోజు లిఖితపూర్వకంగా తెలిపారు. సహజసిద్ధమైన ప్రకృతి ప్రాంతాలు, సాంస్కృతిక, వారసత్వ ప్రదేశాలతో పాటు ప్రత్యేకంగా గుజరాత్ లోని పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించాలని ఈ ఒప్పందంలో పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85 వేల 706 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరకు 64 పాయింట్ల నష్టంతో 85 వేల 642 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 27 పాయింట్ల నష్టంతో 26 వేల 175 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 89 రూపాయల 56 పైసలుగా ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = =